క్లుప్తంగా

మల్లన్న సేవలో తెలంగాణ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్



ఆలయ ప్రాంగణంలో కుటుంబ సమేతంగా మంత్రి కొప్పుల ఈశ్వర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను శనివారం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ మినిస్టర్ కొప్పుల ఈశ్వర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేద పండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

అక్రమంగా కుళాయి కనెక్షన్



పబ్లిక్ కుళాయి తొలగించి ఇంటికి కనెక్షన్ తీసుకున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని కోటావీధిలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ కోసం వేసిన మంచినీటి కుళాయిని అక్రమంగా ఇంటికి కనెక్షన్ తీసుకున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల దాహం తీర్చాలనే ఉద్దేశంతో పబ్లిక్ వాటర్ కనెక్షన్ మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసింది. అయితే టీడీపీకి చెందిన బాషా అనే వ్యక్తి దౌర్జన్యంగా పబ్లిక్ కుళాయి కనెక్షన్‌ను తొలగించి ఇంటికి కుళాయి కనెక్షన్ తీసుకోవడంపై కోటావీధి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ కుళాయి కనెక్షన్లు తొలగించినా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రశ్నించినా, ఫిర్యాదు చేసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ శాఖ అధికారి వెంటనే స్పందించి అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలు తీసుకోవాలని కోటా వీధి ప్రజలు కోరుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నందికొట్కూరు రూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మినా, తరలించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ స్నేహభావంతో మెలగాలని ఆయన సూచించారు.

పంట నష్టపరిహారం మంజూరు చేయాలి

జూపాడుబంగ్లా: వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు దెబ్బతిన్నందున రైతులకు పంట నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వాములు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని మండ్లెం, పారుమంచాల, తంగడంచ గ్రామాల్లో వర్షాధారం కింద సాగుచేసిన పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాల్లేక ఎండిపోతున్న పంటలను చూసి రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. 20 రోజుల నుంచి వర్షాల్లేకపోవటంతో నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, పాములపాడు, మిడుతూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లో వర్షాధారం కింద సాగుచేసిన పంటలు గిడిసబారి ఎండిపోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మన్న, రాజేష్, రాజు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తోందని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దినేష్ కుమార్ అన్నారు. నంద్యాల జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి చేపట్టిన సంగ్రామ్ బైక్ యాత్ర శనివారం ఆత్మకూరుకు చేరింది. పట్టణంలోని పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెస్‌చార్జీలు పెంచాలని, పేద విద్యార్థులకు అన్ని ప్రైవేట్‌పాఠశాలలు 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.

పోరాటాలకు సిద్ధం కండి

ఆత్మకూరు: నరేంద్రమోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం పిలుపునిచ్చారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో శనివారం సీపీఎం డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో మేధావులు, ప్రజాతంత్రవాదులు, దళిత మైనార్టీలపై దాడులు జరిగాయన్నారు. కార్యక్రమంలో స్వాములు, రణధీర్, నరసింహానాయక్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఈ-క్రాప్’తో రైతన్నకు భరోసా

- అన్నింటికీ పంట నమోదే ఆధారం
- ఈ ఏడాది ఖరీఫ్ ప్రక్రియ ప్రారంభం
- సెప్టెంబర్ 15 చివరి తేదీ
- రైతులకు ప్రయోజనకరం



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఆత్మకూరు: అరుగాలం శ్రమించే రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తూ తాము అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా కల్పించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇదే కాకుండా అన్నదాతలకు రైతు భరోసా కేంద్రాలు, పంట గిట్టుబాటు ధరలు, పంటల సబ్సిడీ, బీమా లాంటి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోంది. వీటన్నింటికీ ఈ-క్రాప్ నమోదే ఆధారం.

ఈ-క్రాప్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

ఈ-క్రాప్‌నమోదుతో రైతన్నలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ-క్రాప్ ద్వారా రైతు సాగు చేసిన పంట సాగుతో పాటు, ఆ పంట అతివృష్టి, అనావృష్టి వలన నష్టపోతే రైతులకు పంట నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది. పంటకు సబ్సిడీ లాంటి పథకాలతో పాటు దిగుబడులకు మార్కెట్‌లో సరైన ధర లభించనప్పుడు గిట్టుబాటు ధరకు ప్రభుత్వ విక్రయకేంద్రాల ద్వారా ఆర్బీకేల్లోనే విక్రయించుకోవచ్చు. అంతే కాకుండా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఆర్బీకేల్లోనే పొందవచ్చు. బ్యాంకుల ద్వారా పంట రుణాలను పొందవచ్చు

సెప్టెంబర్ 15 వరకు ఈ-క్రాప్ గడువు

ఈ- క్రాప్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ఏడాది రైతులు సాగు చేసిన ఖరీఫ్ పంట సాగు వివరాలను ఈ-క్రాప్ ద్వారా వ్యవసాయ సిబ్బంది పొలాల వద్దకు వెళ్లి నమోదు చేస్తున్నారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఈ-క్రాప్ నమోదుకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఇప్పటికే ఈ- కేవైసీ నమోదు చేసుకునేందుకు వ్యవసాయ అధికారులు ఏడీఏ , ఏఓ, ఎంపీఈఓలతో పాటు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాల వద్దకు వెళ్లి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో నమోదుతో పాటు, ఈ-కేవైసీ ధ్రువీకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆధార్‌కార్డు, రైతు పాస్ పుస్తకాలు, దరఖాస్తు ఫాంను తీసుకుని రైతులు ఆర్బీకేల్లోని వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

కౌలు రైతులకూ ప్రయోజనం..

ఈ-క్రాప్ నమోదు ద్వారా భూ యజమానులకే కాకుండా ఆ భూముల్లో పంట సాగు చేసే కౌలు రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. కౌలు రైతులకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కౌలు రైతు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్నారు. ఈ- పత్రాల ద్వారా భూ యజమానులైన రైతులు ఏ ప్రయోజనాలు పొందుతారో అవన్నీ కౌలురైతులు పొందవచ్చు.

ఈ-క్రాప్ నమోదు ఉపయోగకరం



వ్యవసాయ సిబ్బంది పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మనం ఏ పంట సాగు చేశామో ఆ పంటకు సంబంధించి పంట నష్టపరిహారం, గిట్టుబాటు ధర ఇలా ఎన్నో ప్రయోజనాలు ప్రభుత్వం కల్పించింది. గతేడాది పత్తి పంట దెబ్బతిన్న రైతులకు పెద్ద ఎత్తున ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం అందించింది. పంట సాగు చేసిన పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడం సంతోషంగా ఉంది. – వెంకటరామయ్య, ఆత్మకూరు

20 ఎకరాలు కౌలుకు తీసుకున్నా



ఆత్మకూరు కురుకుంద గ్రామాల్లో 20 ఎకరాల్లో పొలాలను కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తున్నాను. మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేశా. ఈ-క్రాప్‌ను కూడా వ్యవసాయ సిబ్బంది ద్వారా నమోదు చేయించా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ యజమానులతో పాటు కౌలు రైతులకు కూా ఎరువులు, విత్తనాలు, గిట్టుబాటు ధర అందిస్తూ భరోసా కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – కిరణ్‌కుమార్, ఆత్మకూరు

పకడ్బందీగా ఈ-క్రాప్ నమోదు



ఆత్మకూరు డివిజన్‌పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో ఈ-క్రాప్ నమోదు పకడ్బందీగా చేపడుతున్నాం. వ్యవసాయ సిబ్బంది ఎలా నమోదు చేస్తున్నారో, రైతులు ఏ పంటను సాగు చేస్తున్నారో తదితర వివరాలను స్వయంగా వెళ్లి పర్యవేక్షిస్తున్నాం. ప్రక్రియలో తాము కూడా పాల్గొంటు అవకతవకలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. – ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

‘రెడ్ల చరిత్ర’ పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పూర్ణానంద రాజయోగి లక్ష్మీనారాయణ

మిడుతూరు: రెడ్ల చరిత్ర పుస్తకాన్ని శనివారం స్థానిక అచల పీఠం ఆశ్రమంలో పూర్ణానంద రాజయోగి లక్ష్మీనారాయణ, ప్రముఖ న్యాయవాది రఘునాథ రెడ్డి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నంద్యాల జిల్లా అధ్యక్షులు వీరం మురళీధర్ రెడ్డి, అచల పీఠ పూర్ణానంద రాజయోగిని పోరెడ్డి లక్ష్మీదేవమ్మ, గురువుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచల పీఠ, ఆశ్రమం పూర్ణానంద రాజ యోగి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెడ్ల చరిత్రను తెలుసుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

29న జాబ్‌మేళా

వెలుగోడు: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)ఆధ్వర్యంలో వెలుగోడు పట్టణంలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య(వెలుగు ఆఫీస్) కార్యాలయంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీజీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు ఈ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఈ మేళాలో 3 కంపెనీలు కంపెనీలు పాల్గొననున్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్‌ఇన్‌కు హాజరుకావచ్చు అని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్: 9440224291, 98859 12685లను సంప్రదించాలని సూచించారు.

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి



జస్టిస్ కె.లక్ష్మణ్‌కు ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఏపీ హైకోర్టు జడ్జి ..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి ధూళి దర్శనం చేసుకున్నారు. భ్రమ రాంబా అతిథిగృహం వద్దకు చేరుకున్న జడ్జికి ఈఓ ఎస్ లవన్న పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ధూళి దర్శనం చేసుకున్నారు.



జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఓ

అదుపులోనే అతిసారవ్యాధి



గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

వెలుగోడు: రేగడగూడురు గ్రామంలో అతిసార వ్యాధి అదుపులోనే ఉందని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తెలిపారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ నెల 25న ఏడుగురుకి అతిసార సోకగా, శనివారం మరో 9 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో హెల్త్ వెల్నెస్ సెంటర్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ నేతృత్వంలో అత్యవసర మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి వైద్య సేవలను అందజేస్తున్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. సిబ్బంది సహకారంతో నీటి పరీక్షలు నిర్వహించారు. రేగడ గూడూరు గ్రామంలో అతిసార వ్యాధి పూర్తిగా నియంత్రణలోకి వచ్చే వరకూ మెడికల్ క్యాంపు కొనసాగించాలని డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. ప్రస్తుతం ఏడుగురు అతిసార వ్యాధి బాధితులు మెడికల్ క్యాంపు నుంచి డిశ్చార్జ్ చేశారు.

వేల్పనూరు ఆసుపత్రి తనిఖీ

వేల్పనూరు గ్రామంలోని ప్రాథమిక పైస్థాయి ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రసవాలు పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ జహీర్ వలి, శ్రీనివాసులు, ఫకీర్ బాషా, మాధవి లత పాల్గొన్నారు.

మహానందికి నేడు ఎమ్మెల్యే శిల్పా రాక

మహానంది: భక్తులకు మహానందీశ్వరస్వామి నిజరూపదర్శనం కల్పించాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎంతో కృషి చేశారని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ నిజరూపం కల్పించే మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఆదివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వస్తున్నారన్నారు. దీంతో పాటు మహానందిలో నూతనంగా రూ. 20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారని చెప్పారు.

మాతృభాషను మరువరాదు



తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థిని

కొత్తపల్లి: మాతృభాషను మరువకూడదని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుధాకర్ అన్నారు. మండలంలోని ముసలమడుగు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు తెలుగుభాష గొప్పదనాన్ని వివరించారు. అలాగే పాఠశాల విద్యార్థిని తెలుగు తల్లి వేషధారణ ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల విద్యార్థులతో తెలుగు పాటలకు నృత్య కార్యక్రమాలు చేయించారు.

తెలుగు భాషావారోత్సవాలు

శ్రీశైలంప్రాజెక్ట్: తెలుగుభాషా వారోత్సవాలలో భాగంగా శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు.ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధ్యాపకులు ప్రకాష్ తెలుగుభాష గొప్పతనం, ప్రాముఖ్యత పై వివరించారు. సమావేశంలో అధ్యాపకులు విజయ్‌ప్రకాష్, బాల ఎల్లయ్య, సాంబ శివ, రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు



నాగ ఎల్లయ్య



తొగట ప్రసాద్

కొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ నూతన జిల్లా కమిటీలో కొత్తపల్లి మండలం నుంచి ఇద్దరికి చోటు లభించింది. మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నాగ ఎల్లయ్య, పెద్ద గుమ్మడాపురం గ్రామానికి చెందిన తొగట ప్రసాద్‌లను ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. మల్లెపూల నాగ ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చోటు కల్పించడం జరిగింది అన్నారు. తొగట ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తన పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలను నెరవేరుస్తానన్నారు. ఈ సందర్భంగా వారు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ లతో పాటు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే శిల్పాకు కృతజ్ఞతలు



తిమోతీ

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా కార్యదర్శిగా తనను ఎంపిక చేసినందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి జిల్లా నూతన కార్యదర్శి తిమోతీ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను కొన్ని సంవత్సరాలుగా వైఎస్సార్‌సీపీలో కార్యకర్తగా పనిచేస్తున్నానని, దళితుడిని అయినప్పటికీ ఎమ్మెల్యే తనను ఆదరించారన్నారు. ఆయన అడుజాడల్లో నడిచిన తనకు కౌన్సిలర్ పదవిని అప్పగించి న్యాయం చేశారని చెప్పారు. ప్రస్తుతం పార్టీ జిల్లా కార్యదర్శి పదవికి ఎంపిక చేశారన్నారు. ఆయన నమ్మకాని వమ్ము చేయకుండా వైఎస్సార్‌సీపీ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల వద్దకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేయాలి



హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న నందికొట్కూరు బార్ అసోసియేషన్, సీనియర్ న్యావాదులు

నందికొట్కూరు: నందికొట్కూరుకు అడిషనల్ మేజిస్టేట్ కోర్టును మంజూరు చేయాలని ఏజీపీ నాగేశ్వర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి శరబయ్య కోరారు. శనివారం కర్నూలు పట్టణంలోని పోలీసు గెస్ట్‌హౌస్‌లో హైకోర్టు పోర్ట్‌పోలియో జడ్జి బీ.కృష్ణామోహన్‌కు నందికొట్కూరు బార్ అసోసియేషన్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అడిషనల్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరైతే కక్షిదారులకు త్వరగా న్యాయం జరుగుతుందన్నారు. కేసులు వేగంగా పరిష్కారమవుతాయని చెప్పారు. అనంతరం జడ్జిని ఘనంగా సన్మానించారు. వీరి వెంట బార్ అసోసియేషన్ కోశాధికారి అరుణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

‘జగనన్న భూహక్కు - భూ రక్ష’ గ్రామసభలు



బన్నూరు లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మిడుతూరు: జగనన్న భూ హక్కు- భూ రక్ష పథకం కింద యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు అందజేసి స్వామిత్వ కార్యక్రమంపై అలగనూరు, 49 బన్నూరు గ్రామాల్లోని సర్పంచ్‌ల అధ్యక్షతన కృష్ణవేణి, భూదేవి గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వామిత్వ అంటే ఏమిటి? ఎలా నిర్వహిస్తారు? అనే విషయాలను కులంకశంగా వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనురాధ, బీజాన్ బీ,వీరారెడ్డి,సర్వేయర్లు, వలంటీర్స్ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లపై కేసు నమోదు చేయాలి



కొత్తపల్లిలో టీడీపీ నాయకులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్లు పరశురాముడు, రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ ఎల్లయ్య, జగదీశ్వర గౌడు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ హుస్సేన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ రోడ్ షోలలో, పాదయాత్రలో 2019 నుండి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికి టీడీపీ పార్టీలో నామినేటెడ్ పదవులు ఇస్తామని కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రేరేపిస్తున్నారన్నారు.

నందికొట్కూరు రూరల్ : రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ అల్లర్లు సృష్టించేందుకు తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోందని మండల వైఎస్సార్‌సీపీ కో-కన్వీనర్ సుధాకర్ తెలిపారు. శనివారం బ్రాహ్మణకొట్కూరు ఎస్.ఐ ఓబులేసుకి వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: శాంతిభద్రతలకు భంగం కలిగేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేతలు నారాలోకేష్, చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడు లపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మధు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ నాగార్జునకు పిర్యాదు చేశారు. కార్యక్రమంలో కోకన్వీనర్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



మదర్‌థెరిస్సా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొదుపు మహిళలు

జూపాడుబంగ్లా: మదర్‌థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఏపీఎం అంబమ్మ తెలిపారు. శనివారం మదర్‌థెరిసా 113వ జయంతిని పురస్కరించుకొని జూపాడుబంగ్లా వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మదర్‌థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి కేక్‌కట్‌చేసి ఆమె సేవలను స్మరించుకున్నారు.

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: కారుణ్య మూర్తి మదర్‌థెరిస్సా 114వ జయంతి వేడుకలను శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా.ఎమ్‌పద్మ మదర్‌థెరిస్సా గురించి మాట్లాడారు.

దీనుల దేవత మదర్ థెరిస్సా

వెలుగోడు: మదర్ థెరిస్సా దీనుల పాలిట దేవతగా నిలిచారని మహానందీశ్వర స్కూల్ కరస్పాండెంట్ పి.అనురాధ కొనియాడారు. మదర్ థెరిస్సా 113వ జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక ఇందిరానగర్‌లోని ప్రగతి అనాథ శరణాలయంలో మదర్ చిత్ర పటానికి నివాళులు అర్పించి కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్ రాజేశ్వరి, ఆర్ఎంపీ వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఏఐటీయూసీ నాయకులు స్వామిరెడ్డి భవనం నుంచి ర్యాలీగా అక్కమ్మ సెంటర్, సులేమాన్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ సున్నిపెంట గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మాణాలను పూర్తిగా నిలిపివేశారని, దీంతో వందలాదిగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. సుమారు 30 సంవత్సరాల నుంచి ఇక్కడ నివసిస్తున్న ప్రజలు గృహాలకు మరమ్మతులు చేసుకోవడం, తాత్కాలిక గృహాల నుంచి పక్కాగృహాలుగా నిర్మాణం చేసుకునేందుకు అనుమతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు అన్వర్‌బాషా, పులిరాజు, రమేష్, మల్లికార్జున, దేవయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలీలపై కొండముచ్చు దాడి

మహానంది: గోపవరం సమీపంలోని గోశాల వద్ద పొలంలో వరినాట్లకు వెళ్లిన మహిళా కూలీలపై కొండముచ్చు దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గోపవరం గ్రామానికి చెందిన వెంకటమ్మ, జయమ్మ, మేరీ, మరికొందరు శనివారం వరినాటు కోసం వెళ్లారు. గోశాల పరిసరాల్లో తిరుగుతున్న కొండముచ్చు తాళ్లను తప్పించుకుని పొలం పనులు చేస్తున్న మహిళలపై దాడి చేసింది. ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. కొండముచ్చును అడవిలో వదిలేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆత్మకూరు: మండల పరిధిలోని బైర్లూటి సమీపంలో ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని నాగలూటి గూడేనికి చెందిన చెంచుగిరిజనులు శనివారం ఆటోలో ఆత్మకూరుకు వస్తుండగా ఆత్మకూరు నుంచి బైర్లూటి వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న చెంచుగుర్రప్ప, గుర్రమ్మ, పాలకమ్మ, గురవయ్యలకు గాయాలయ్యాయి. వీరిని ఆత్మకూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పాలకమ్మ, గుర్రమ్మలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వవైద్యశాలకు తరలించనున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు- సంతజూటూరు మార్గంలో సుంకులమ్మ గుడి వద్ద ఉన్న మలుపు సమీపంలో శనివారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన నంద్యాలకు చెందిన తిరుపతి, ముత్యాలపాడుకు చెందిన సాయిని చికిత్స నిమిత్తం బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు.